క్లుప్తంగా

గ్రంథాలయానికి పుస్తకాల వితరణ



వనపర్తిటౌన్: జిల్లా గ్రంథాలయానికి రిటైర్డ్ హెడ్మాస్టర్ ఎస్. చెన్నరాములు నవలలు, చరిత్ర, గ్రూప్స్‌కు సంబంధించిన పుస్తకాలను వితరణ చేశారు. శుక్రవారం పుస్తకాలను జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ లక్ష్మయ్యకు అందజేశారు. ఆయన మాట్లాడుతూ.. అభ్యర్థులు గ్రంథాలయంలోని పుస్తకాలను సద్వినియోగం చేసుకుని ప్రభుత్వ, ప్రైవేట్ జాబ్స్‌లో ఉత్తీర్ణత సాధించాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ గట్టుయాదవ్, వైస్ చైర్మన్ వాకిటి శ్రీధర్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

కానాయపల్లి టు శ్రీశైలం పాదయాత్ర



కొత్తకోట రూరల్: కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంతో పాటు ముఖ్యమంత్రిగా రేవంత్‌రెడ్డి ప్రమాణ స్వీకారం చేస్తే మల్లన్నను పాదయాత్ర ద్వారా దర్శించుకుంటానని కానాయపల్లికి చెందిన రాజు మొక్కుకున్నాడు. శుక్రవారం గ్రామం నుంచి శ్రీశైలం మల్లన్న దర్శనం కోసం పాదయాత్ర ద్వారా బయలు దేరి వెళ్లాడు. యువకుడుని గ్రామంలోని కాంగ్రెస్ నాయకులు పూలమాలలు వేసి పంపించారు.

ఏబీవీపీ రాష్ట్ర కమిటీలో చోటు

అమరచింత: ఏబీవీపీ రాష్ట్ర కమిటీలో పట్టణానికి చెందిన వగ్గు సాయికుమార్‌కు చోటు కల్పించడం హర్షణీయమని మండల కన్వీనర్ అఖిల్ శుక్రవారం తెలిపారు. ఢిల్లీలో తెలంగాణ రాష్ట్ర మహాసభల్లో రాష్ట్ర అధ్యక్షుడు జానారెడ్డి అమరచింతకు చెందిన వగ్గుసాయి కుమార్‌కు రాష్ట్ర కమిటీ సభ్యుడిగా ఎన్నుకున్నట్లు తెలిపారు.

నాయకుల పరామర్శ

గోపాల్‌పేట: మండలంలోని ఏదుట్లలో కాంగ్రెస్ పార్టీకి చెందిన ఇద్దరు కార్యకర్తలు ఇసాక్, ఊశన్న మృతి చెందారు. వీరి కుటుంబాలను స్థానిక నాయకులు సత్యశీలారెడ్డి మెడికల్‌రాజు, దేవని విష్ణు, మధు, మహేష్ శుక్రవారం పరామర్శించి ఆర్థికసాయం అందించారు.

తప్పిన ప్రమాదం



గోపాల్‌పేట: మండలంలోని తాడిపర్తిలో ఓ రైతుకు తృటిలో ప్రాణగండం తప్పింది. తాడిపర్తి చెందిన ఓ రైతు తన పొలంలో ట్రాక్టరుతో కరిగెట చేయిస్తున్నాడు. కరిగెట చేస్తున్న పొలంలో కరెంటు స్తంభం పక్కనే ఉన్న స్టేవైరుకు రోటవేటర్‌కు తగిలి స్తంభం విరిగి కిందపడింది. సరిగ్గా ట్రాక్టరుపై పడటంతో డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. ఒకవేళ కరెంట్ వైర్లలో విద్యుత్ పాస్ అయిఉంటే పెను ప్రమాదం జరిగేదని, ప్రాణాపాయం తప్పిందని తాడిపర్తి రైతులు తెలిపారు.

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

కొల్లాపూర్ రూరల్: విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని ఎంఈఓ చంద్రుడు నాయక్ ఉపాధ్యాయులను హెచ్చరించారు. శుక్రవారం మండలంలోని ఎల్లూరు, కొల్లాపూర్ పట్టణంలో ఉన్న సముదాయ పాఠశాలల సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. టీఎంఎల్ వినియోగించి ఎఫ్ఎల్ఎన్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు. డీఎస్ఈ–ఎఫ్ఆర్ఎస్ యాప్‌లో ప్రతి రోజు బాధ్యతగా నూరు శాతం హాజరు నమోదు చేయాలన్నారు. ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలని కోరారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు గోవిందుగౌడ్, చంద్రారెడ్డి, కురుమయ్య, సీఆర్పీ వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

వాలీబాల్ టీంకు విద్యార్థి ఎంపిక



నవాబుపేట: వాలీబాల్ స్కూల్ లేవల్ రాష్ట్ర జట్టుకు జెడ్పీ పాఠశాల విద్యార్థి ప్రశాంత్ ఎంపికైనట్లు హెచ్ఎం నాగ్యానాయక్ తెలిపారు. శుక్రవారం పాఠశాలలో విద్యార్థిని ప్రజాప్రతినిధులు, అధికారులు అభినందించారు. సర్పంచ్ గోపాల్‌గౌడ్, పీఏసీఎస్ చైర్మన్ నర్సింహులు, సీఆర్పీ జనార్దన్ పాల్గొన్నారు.

తెగుళ్ల బెడద.. తగ్గిన దిగుబడి

- ఆందోళనలో రైతులు
- 4,668 ఎకరాలలో మామిడి తోటల సాగు



వీపనగండ్లలో మామిడితోట

వీపనగండ్ల: మండలంలోని పలు గ్రామాలలో మామిడి తోటలను సాగుచేస్తున్న రైతులు పంటల దిగుబడి సరిగా రాక నష్టపోతున్నారు. మండలంలో అత్యధికంగా రైతులు మామిడి తోటలను సాగు చేస్తున్నారు. మూడేళ్లుగా కనీస పెట్టుబడులు రాక తీవ్రంగా నష్టపోయారు. ఈ ఏడాదైన ముందస్తు రైతు అవగాహన సదస్సులు నిర్వహించి అధిక దిగుబడులు వచ్చేలా చూడాలని పలువురు రైతులు ఉద్యానవన శాఖ అధికారులకు విన్నవిస్తున్నారు.

4,668 ఎకరాలలో సాగు

మండలంలో 4,668 ఎకరాలలో రైతులు మామిడి తోటలను సాగు చేస్తున్నారు. అందులో బొల్లారంలో 435, కొర్లకుంటలో 191, వల్లాభాపురంలో 66, గోపల్‌దిన్నెలో 384, కల్వరాల్లలో 345, గోవర్ధనగిరిలో 867, పుల్గర్‌చర్లలో 196, సంగినేనిపల్లిలో 381, సంపత్‌రావుపల్లిలో 175, తూముకుంటలో 441, వీపనగండ్లలో 1,207 ఎకరాలలో రైతులు మామిడి పంటలను సాగు చేస్తున్నారు. దీంతోపాటు మరో 1,500 ఎకరాలలో చిన్నదశలో ఉన్న మామిడి మొక్కలను పెంచుతున్నారు.

ఏట నష్టాలలో..

మూడేళ్లుగా మామిడి తోటలకు తామర తెగులు సోకడంతో ఎకరాకు 30 టన్నుల దిగుబడి రావాల్సి ఉండగా కనీసం 10 టన్నుల దిగుబడి కూడా రాలేదు. వచ్చిన కొద్దిపాటి దిగుబడిని అమ్ముకునేందుకు సమీపంలో మామిడి మార్కెట్‌లను ఏర్పాటు చేయకపోవడంతో జడ్చర్ల, హైదరాబాద్ పట్టణానికి మామిడికాయలను తీసుకెళ్లిన రైతులు దళారుల బారినపడి అధిక మొత్తంలో నష్టపోయారు. ఉన్నతాధికారులు చొరవ చూపి మామిడి మార్కెట్ తోపాటు అవగాహన సదస్సును నిర్వహించాలని రైతులు కోరుతున్నారు.

కౌలు డబ్బులు రాలేదు



మామిడి తోటలను లీజుకు తీసుకొని రూ.లక్షల్లో పెట్టుబడి పెట్టగా వచ్చిన దిగుబడిని విక్రయించగా కనీస కౌలు డబ్బులు కూడా రాలేదు. కొల్లాపూర్‌లో మామిడి విక్రయ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తామని ఎన్నో ఏళ్లుగా చెబుతున్నా కార్యరూపం దాల్చడం లేదు.

– రాజు, రైతు సంగినేపల్లి

సమష్టి చర్యలతోనే అధిక లాభాలు



మామిడి రైతులు సమష్టి నివారణ చర్యలు తీసుకోవడం వల్లే అధిక దిగుబడులను పొందవచ్చు. సరైన సమయంలో సస్య రక్షణ చర్యలు తీసుకుంటే తెగుళ్ల బారి నుంచి మామిడి తోటలను కాపాడుకోవచ్చు. అవగాహన సదస్సుల ఏర్పాటు కోసం ఉన్నతాధికారులకు తెలియజేస్తాం.

– కృష్ణ, ఉద్యానవనశాఖ అధికారి, వీపనగండ్ల

నిల్వ నీటితోనే సర్వరోగాలు



అన్నారంలో తొట్టిలో నిల్వనీటిని పరిశీలిస్తున్న వైద్య సిబ్బంది

పాన్‌గల్: నిల్వ నీటితోనే రోగాలు సంభవిస్తాయని వారంలో ఒక రోజు నిల్వ నీటిని పారబోసి కొత్తగా నీటిని పట్టుకోవాలని కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ రామయ్య అన్నారు. శుక్రవారం డ్రైడే లో భాగంగా అన్నారంలో వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు కాలనీల్లో పర్యటించి పరిసరాలు, వ్యక్తిగత పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇంటి ముందు ఉన్న తొట్టిలలో నీటిని ఎక్కువ రోజులు నిల్వ ఉంచరాదని, అలా ఉంచితే దోమలు, ఈగలు వ్యాప్తి చెందే అవకాశం ఉందన్నారు. ఆరోగ్య సమస్యలు ఉంటే వెంటనే ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించాలన్నారు.

క్రమం తప్పకుండా మందులు వాడాలి

టీబీ వ్యాధిగ్రస్తులు వైద్యుల సూచనలు పాటిస్తూ క్రమం తప్పకుండా మందులు వాడితే రోగం నయమవుతుందన్నారు. రెండు వారాలకు మించి దగ్గు, రాత్రి వేళల్లో జ్వరం, చెమటలు పట్టడం, స్వల్ప కాలంలో బరువు తగ్గిన వారు తెమడ పరీక్షలు చేయించుకోవాలన్నారు. అనుమానితుల నుంచి వ్యాధి నిర్ధారణ నిమిత్తం తెమడను సేకరించినట్లు వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది సంతోషమ్మ, రాంచందర్, రేవతమ్మ పాల్గొన్నారు.

ప్రతి వారం మొక్కలకు నీళ్లు పట్టాలి

ఖిల్లాఘనపురం: మండలంలోని అన్ని గ్రామాల్లో హరితహారం కార్యక్రమంలో భాగంగా రోడ్ల వెంట నాటిన మొక్కలకు ప్రతి వారం నీళ్లుపట్టాలని ఎంపీడీఓ విజయ్‌కుమార్ తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలోని నర్సరీ, రోడ్డు వెంట నాటిన మొక్కలకు నీళ్లు పట్టే పనులను ఎంపీడీఓ పరిశీలించారు. అనంతరం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో కార్యదర్శులు, ఉపాధి సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతం మండలంలోని అన్ని గ్రామాల నర్సరీల్లో పనులు వేగంగా చేపడుతున్నట్లు తెలిపారు. మట్టిని సిద్ధం చేసి బ్యాగ్‌ఫిల్లింగ్ పనులను ముమ్మరంగా చేపడుతున్నట్లు పేర్కొన్నారు. కొన్ని గ్రామాల్లో ఇప్పటికే విత్తనాలు నాటినట్లు తెలిపారు.



నర్సరీ పరిశీలిస్తున్న ఎంపీడీఓ విజయ్‌కుమార్

కార్యదర్శులు తరుచుగా నర్సరీలను పరిశీలించి పనులు వేగంగా చేసేలా చూడాలన్నారు. కార్యక్రమంలో ఎంపీఓ రాజు, కార్యదర్శులు, ఉపాధి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో సామర్థ్యాలు పెంపొందించాలి

దేవరకద్ర రూరల్: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాలు పెంపొందించాలని మండల నోడల్ అధికారి బలరాం అన్నారు. శుక్రవారం లక్ష్మీపల్లి, బస్వాయపల్లి, చౌదర్‌పల్లి గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలలను సందర్శించారు. ఎఫ్ఎల్ఎన్ అమలు తీరుపై సమీక్ష నిర్వహించారు. అనంతరం పాఠశాల రికార్డులను పరిశీలన చేసి విద్యార్థుల హాజరుశాతం పెంచాలని సూచించారు. కార్యక్రమంలో వెంకటేశ్వర్లు, అశ్విని, బాసిత్, కల్పన తదితరులు పాల్గొన్నారు.



రికార్డులను పరిశీలిస్తున్న నోడల్ అధికారి బలరాం

గ్రంథాలయ నిర్వహణపై నిర్లక్ష్యం

- ఏటేటా మెయింటెనెన్స్ చెల్లింపు
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు



పట్టణంలో మూతపడిన గ్రంథాలయం

అమరచింత: పట్టణంలో కొన్నేళ్లుగా గ్రంథాలయం మూతపడిన అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోవడంతో వాటిలోని పుస్తకాలు, గ్రంథాలు చదులు పట్టిపోతున్నాయి. మండలంగా ఏర్పాటు కాకముందే పట్టణంలోని శాఖ గంథ్రాలయాన్ని నిర్వహిస్తు పాఠకులకు దినపత్రికలతో పాటు కథల పుస్తకాలు, వివిధ రకాల నవలలు అందుబాటులో ఉంచేవారు. మండలం ఏర్పడినప్పటి నుంచి గ్రంథాలయ నిర్వహణపై జిల్లా గ్రంథాలయ శాఖ దృష్టి సారించకపోవడంతో ఇప్పటికి మూసిన తలుపులు మూసినట్టుగానే ఉన్నాయి. పట్టణంలోని కొంత మంది యువకులు, ఉపాధ్యాయులు, వివిధ రాజకీయ పార్టీ నాయకుల సహకారంతో గ్రంథాలయ ఆవశ్యకతను గుర్తించి చందాలతో కొన్ని ఏళ్లు గ్రంథాలయాన్ని కొనసాగించారు. మాజీ అడ్వకేట్ జనరల్, డీఎంఆర్ఎం ట్రస్ట్ చైర్మన్ దేశాయి ప్రకాష్ రెడ్డి భవన అద్దెతో పాటు నిర్వాహకుడికి వేతనం అందిస్తూ వచ్చారు. కొంత కాలానికి భారం అధికమవ్వడంతో వెనకడుగు వేశారు. దీంతో నాలుగేళ్లుగా పట్టణంలో గ్రంథాలయం మూతపడింది. మున్సిపాలిటీ వచ్చిన తర్వాతనైన గ్రంథాలయానికి మహర్దశ వస్తుందని ఆశపడిన పాఠకులకు నిరాశే మిగిలింది.

మూడేళ్లుగా మెయింటెనెన్స్ చెల్లింపు

మున్సిపాలిటీ ఏర్పాటు తర్వాత అధికారుల ఆదేశాల ప్రకారం పట్టణంలో గ్రంథాలయ నిర్వహణ కోసం ప్రతి సంవత్సరం ఇంటి పన్నుల వసూళ్లలో 7శాతం వాటాను జిల్లా గ్రంథాలయ సంస్థకు పంపుతున్నారు. మొదటి సంవత్సరం రూ.15వేలు, రెండో సంవత్సరం రూ.45వేలు, మూడవ సంవత్సరం రూ.92 వేలు మున్సిపాలిటీ ద్వారా చెల్లించారు. ప్రస్తుత సంవత్సరం రూ.2.30 లక్షలు చెల్లించేందుకు సిద్ధంగా ఉన్నారు. మున్సిపాలిటీ ద్వారా మెయింటెనెన్స్ అందుకుంటున్న జిల్లా గ్రంథాలయ శాఖ మాత్రం దినపత్రికలను సైతం అందుబాటులోకి తీసుకోచ్చే ప్రయత్నం చేయలేకపోతుంది.

చర్యలు తీసుకుంటాం

పట్టణంలో గ్రంథాలయ నిర్వహణ కోసం జిల్లా గ్రంథాలయ శాఖకు ప్రతి సంవత్సరం నిధులను చెల్లిస్తున్నాం. ఉన్నతాధికారులకు సమస్యను విన్నవించి గ్రంథాలయం అందుబాటులోకి వచ్చే విధంగా చర్యలు తీసుకుంటాం.

– మహమ్మద్ ఖాజా, మున్సిపల్ కమిషనర్

రగ్బీలో విద్యార్థుల ప్రతిభ



మిడ్జిల్: ఉమ్మడి జిల్లా స్థాయి రగ్బీ పోటీల్లో మిడ్జిల్ ఉన్నత పాఠశాల విద్యార్థులు మానస, విష్ణు ఉత్తమ ప్రతిభ కనబర్చారని.. ఈనెల 12న జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారని పీడీ పరశురామ్ తెలిపారు. విద్యార్థులను శుక్రవారం పాఠశాల హెచ్ఎం సరస్వతి అభినందించారు.

జాతీయస్థాయి పోటీలకు గురుకుల విద్యార్థిని



బాలానగర్: మండల కేంద్రంలోని గురుకుల పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న విద్యార్థిని వీ.నందిని జాతీయ స్థాయి కరాటే పోటీలకు ఎంపికైందని కోచ్ కృష్ణయ్య తెలిపారు. ఈ నెల 16 నుంచి ఢిల్లీలో జాతీయ క్రీడలు జరగనున్నాయని వివరించారు. శుక్రవారం పాఠశాలలో ప్రిన్సిపాల్ కృష్ణమూర్తి, పీఈటీ అరుణ, తదితరులు విద్యార్థిని సత్కరించినట్లు వివరించారు.

రాష్ట్రస్థాయిలో ప్రతిభ చాటాలి



మహబూబ్‌నగర్ క్రీడలు: నల్గొండ జిల్లా చర్లపల్లిలో శనివారం, ఆదివారాల్లో జరిగే రాష్ట్ర స్థాయి అండర్–19 షూటింగ్‌బాల్ పోటీలకు జిల్లా కేంద్రంలోని టిమిరీస్ ఒకేషనల్ జూనియర్ కళాశాల బాలుర-3 విద్యార్థులు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ అబ్దుల్ సమీ తెలిపారు. విద్యార్థులను విజిలెన్స్ అధికారులు జమీర్‌ఖాన్, ఆలం ఖాన్, పీఈటీ గులాం అఫ్రోజ్ అభినందించారు. రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ చాటాలని వారు కోరారు.

సమస్యల పరిష్కారానికి 'గుడ్‌మార్నింగ్ దేవరకద్ర'



చిన్నచింతకుంట: నియోజవర్గ అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి అన్నారు. శుక్రవారం దమగ్నాపురంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ప్రభుత్వంప్రవేశ పెట్టిన పథకాలను పార్టీలకు అతీతంగా అర్హులైన ప్రతి లబ్ధిదారునికి అందేలా చూస్తానన్నారు. గత పాలకులు పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్ట్, నియోజక వర్గంలోని చెక్‌డ్యాంల నిర్మాణంలో అవినీతికి పాల్పడ్డారని తన దృష్టికి వచ్చిందన్నారు. విచారణ చేయించి అవినీతికి పాల్పడిన వారు ఎవరైనా సరే... వారిపై చట్టపరమైన చర్యలు తీసుకునేలా కృషిచేస్తానన్నారు. సమస్యలు పరిష్కరించేందుకు దేవరకద్ర గుడ్‌మార్నింగ్ కార్యక్రమం కూడా చేపడతామన్నారు. రోజూ ఒక గ్రామాన్ని సందర్శించి సమస్యలు తెలుసుకుని పరిష్కారానికి కృషి చేస్తానని వివరించారు. ఎమ్మెల్యేగా ఎన్నిక కావడంతో నియోజకవర్గంలోని కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఆయనను శాలువాలు పూలమాలలతో సత్కరించారు. మండల అధ్యక్షుడు నరేందర్‌రెడ్డి, గుడిబండ ఎంపీటీసీ శకుంతల, కొమిరెడ్డిపల్లి ఎంపీటీసీ సంతోషి పాల్గొన్నారు.

అడ్డాకుల: అడ్డాకుల, మూసాపేట మండలాలకు చెందిన కాంగ్రెస్ నాయకులు శుక్రవారం ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డిని కలిశారు. శాలువాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. సయ్యద్‌షఫి, శ్రీనివాస్‌రెడ్డి, దశరథ్‌రెడ్డి, ఎస్టీగౌడ్, నారాయణ తదితరులు ఉన్నారు.

కాంగ్రెస్ శ్రేణుల సంబరాలు

పాన్‌గల్: కొల్లాపూర్ ఎమ్మెల్యే జూపల్లి కృష్ణారావుకు మంత్రి పదవి దక్కడంతో కాంగ్రెస్ నాయకులు శుక్రవారం మండల కేంద్రంలో సంబరాలు చేశారు. బస్టాండ్ చౌరస్తాలో టపాసులు కాలాచ్చారు. కార్యక్రమంలో బ్రహ్మయ్య, ఇలియాస్, నరేందర్, శివ, ఆదిల్, షరీఫ్, బాలస్వామి, అక్రం, రాములు, మన్యం తదితరులు పాల్గొన్నారు.

మంత్రికి సన్మానం..

మంత్రి పదవి చేపట్టిన జూపల్లి కృష్ణారావును మండల నాయకులు రాముయాదవ్, పరశురాం శాలువాతో సన్మానించి పూల మొక్కను అందజేశారు.



మంత్రి జూపల్లికి పూలమొక్కను అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

వీరితో పాటు గోప్లాపూర్, కేతేపల్లి చెందిన నాయకులు మంత్రిని కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

దిమ్మెలు నిర్మించి.. ట్రాన్స్‌ఫార్మర్‌లు మరిచారు

అమరచింత: పట్టణ కేంద్రంలో విద్యుత్ లోఓల్టేజి సమస్యను పరిష్కరించాలని భావించిన మున్సిపల్ యంత్రాంగం ఆయా వార్డులలో నాలుగు ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది. వీటికి కావాల్సిన నిధులను ట్రాన్స్‌కో అధికారులు అప్పగించారు. మహంకాళివీధి, కొత్త ఎస్సీకాలనీ, జోగిని కాలనీల్లో వీటి కోసం దిమ్మెలను నిర్మించారు. వీటిని నిర్మించి మూడు నెలల కాలం గడుస్తున్న ఇప్పటి వరకు ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయలేదు.



మహంకాళి వీధిలో నిర్మించిన దిమ్మె

ప్రమాదాలకు నిలయంగా పెద్దాయపల్లి కూడలి



పెద్దాయపల్లి కూడలి

- అండర్‌పాస్ లేక తరుచూ ప్రమాదాలు
- బారికేడ్లు ఏర్పాటు చేసినా ఫలితం అంతంతే..
- ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మించాలంటున్న మండల ప్రజలు

బాలానగర్: మండల పరిధిలోని జాతీయ రహదారి–44పై పెద్దాయపల్లి గ్రామ కూడలి తరుచూ ప్రమాదాలకు నిలయంగా మారింది. ప్రమాదాలు జరిగే ప్రాంతంమని గుర్తించినా ఎవరూ పట్టించుకోవడం లేదు. సంబంధిత నేషనల్ హైవే అధికారులు, టోల్‌ప్లాజా అధికారులు అంతంత మాత్రంగానే చర్యలు చేపట్టారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

- సాధారణంగా జాతీయరహదారి నుంచి పరిసర గ్రామాలకు వెళ్లే ముఖ్య కూడళ్లలో రెండు లైన్లుగా ఉన్న రహదారిని కనీసం 50 మీటర్లు మూడు లైన్లుగా, వాహనాల రద్దీని దృష్టిలో ఉంచుకుని నాలుగు వరసలుగా నిర్మాణం చేస్తారు. కానీ పెద్దాయపల్లి కూడలి వద్ద గ్రామం వైపుగా నాలుగు వరుసల రోడ్డు ఏర్పాటు చేయగా.. మరో వైపు గుండేడ్, ఉడిత్యాల గ్రామాల వైపుగా ఉన్న జాతీయరహదారి కేవలం రెండు వరుసలు వేసి వదిలేశారు. దీంతో గుండేడ్ గ్రామం వైపు తరుచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి.
- గుండేడ్ వైపుగా జాతీయరహదారిపైకి వచ్చే భారీవాహనాలు దాదాపు రెండులైన్ల రోడ్డును ఆక్రమించుకొని యూ టర్న్ తీసుకుంటాయి. దీంతో అటువైపుగా వచ్చే వాహనాలు వేగంగా రావడంతో అదుపు తప్పి యూటర్న్ చేస్తున్న వాహనాలను, రోడ్డు దాటుతున్న వాహనాలను ఢీకొనడంతో ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయి. మండల కేంద్రం నుంచి నవాబ్‌పేట్ మండలంతోపాటు, ఉడిత్యాల, నేరళ్లపల్లి, రాఘవాపూర్, చొక్కంపేట్, సూరారం, వీరన్నపల్లి, జాలుగడ్డ, వాయిల్ కుంట, ఊటకుంట, ఈదమ్మగడ్డ, గుండేడ్, చెన్నంగులగడ్డ, చింతకుంట తండా గ్రామ పంచాయతీలతో పాటు పదుల సంఖ్యలో ఉన్న తండాలకు వెళ్లేవారు అధికంగా ఉంటుండంతో సాధారణంగా వాహనాల రద్దీ అధికంగా ఉంటోంది. అయినప్పటికీ ముఖ్య కూడలిలో రోడ్డు రెండు లైన్లుగా మాత్రమే ఉండడంతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఆయా ఘటనల్లో పలువురు మృత్యువాత పడిన సందర్భాలూ లేకపోలేదు.

అండర్‌పాస్ లేదా బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలి

జడ్చర్ల వైపు నుంచి బాలానగర్ వచ్చే వాహనాలకు ఎటువంటి అడ్డంకీ లేకపోవడంతో వేగంగా వస్తుంటాయి. దీంతో ముఖ్యకూడలిలో రోడ్డు దాటే వాహనాలను ఢీకొంటూ ప్రమాదాలు అధికంగా జరుగుతున్నాయి. అటువైపుగా వచ్చే వాహనాల వేగాన్ని నియంత్రించడానికి బారికేడ్లు ఏర్పాటు చేసినా, బ్లింకింగ్ సిగ్నల్ ఏర్పాటు చేసినా ఫలితం అంతంతమాత్రమే కనిపిస్తోంది. దీంతో సబ్‌రోడ్డు, రోడ్డు విస్తరణతోపాటు, బ్రిడ్జి నిర్మాణం చేస్తేనే ప్రమాదాలు జరగకుండా శాశ్వత పరిష్కారం లభించనుందని మండల ప్రజలు అభిప్రాయ పడుతున్నారు.



రోడ్డు ప్రమాదానికి గురైన కారు(ఫైల్)

వేగ నియంత్రికలు ఏర్పాటు చేయాలి



పెద్దాయపల్లి కూడలిలో జాతీయ రహదారిపై జడ్చర్ల వైపు నుంచి బాలానగర్ వైపు వచ్చే వాహనాల వేగాన్ని అదుపు చేసేందుకు అవసరమైన మరిన్ని బారికేడ్లు ఏర్పాటు చేయడంతోపాటు రోడ్డును విస్తరించాలి. తద్వారా ప్రమాదాలు తగ్గడానికి అవకాశం ఉంటుంది.

–బాబు నాయక్, నేరళ్లపల్లి

ఫ్లైఓవర్ నిర్మించాలి



ప్రధాన కూడలిలో రెండు లైన్లుగా ఉన్న రోడ్డును నాలుగు లైన్లుగా మార్చడంతోపాటు అంతర్గత రోడ్డు లేదా బ్రిడ్జి నిర్మాణం చేస్తేనే ప్రమాదాలు తగ్గుముఖం పట్టే అవకాశం ఉంది. ఈ దిశగా గతంలో అధికారులకు సైతం విన్నవించాం. ఇప్పటికైనా చర్యలు చేపట్టి సమస్య పరిష్కరించాలి.

– చెన్నారెడ్డి, గుండేడ్ గ్రామం

నివేదికలు పంపించాం

బాలానగర్‌తోపాటు, పెద్దాయపల్లి ముఖ్య కూడలిలో గ్రీన్‌ఫీల్డ్ రహదారిగా మారనున్న నేపథ్యంలో నాలుగు వరసలుగా ఉన్న బీటీ రోడ్డు ఆరు వరుసలుగా మారడంతోపాటు అండర్‌పాస్‌లు, సబ్ రోడ్ల నిర్మాణం చేపడతాం. సంబంధించిన అన్ని చర్యలు చేపట్టాం. నివేదికలు పంపించాం. వాహనదారులకు సైతం అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నాం.

– ఇబ్రహీం, రాయికల్ టోల్‌ప్లాజా మేనేజర్